# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పశ్చిమాసియాలో ఉద్రికతల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న ప్రవాసాంధ్రులు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఈరోజు సమావేశమవుతారు.**

3. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని హోం శాఖ మంత్రి వి.అనిత తెలిపారు.**

4. **రైతులకు సాగునీటి భద్రత కల్పించేందుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

5. **దేశవ్యాప్తంగా హోలీ పండుగను ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

పశ్చిమాసియాలో ఉద్రికతల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న ప్రవాసాంధ్రులు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇబ్బందులూ పడకుండా అన్ని ఏర్పాట్లూ చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమాసియాలో ప్రవాసాంధ్రుల పరిస్థితిపై గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్, ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ-ఏపీఎన్ఆర్‌టీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రవాసాంధ్రులు ఎవరూ ఆందోళన పడొద్దని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. విమానాశ్రయాలు మూసివేయడం, పలు సర్వీసుల రద్దు నేపథ్యంలో పరిస్థితులు చక్కబడే వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

--------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఈరోజు సమావేశమవుతారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఈ సమావేశంలో 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సదస్సును రెండు విడతల్లో నిర్వహిస్తారు. ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లాల వారీగా జరగనున్న జనగణన ప్రక్రియపై కలెక్టర్లకు అవగాహన కల్పిస్తారు. మధ్యాహ్నం తిరిగి

ప్రారంభమయ్యే సమావేశంలో ముఖ్యమంత్రి సహా మంత్రులు, అన్ని శాఖల కార్యదర్శులు హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్లకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. గ్రామస్థాయిలో పరిపాలన బలోపేతం.. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ద్వారా ప్రజలకు సమర్థ సేవలందించడంపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు నగరాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ అధికారులతో కేంద్ర మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 400 కోట్ల రూపాయలతో రహదారులు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. 2027 నాటికి నగరంలోని శంకర్ విలాస్ వంతెన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి వివరిస్తూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

రైతులకు సాగునీటి భద్రత కల్పించేందుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో మొత్తం 46 వేల 113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దశలవారీగా మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు, ఇందులో మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 6 వేల 593, దక్షిణ ప్రాంత పరిధిలో 11 వేల 926, తూర్పు ప్రాంతపరిధిలో 27 వేల 594 కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. రైతుల సంక్షేమం కోసం అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, సాగునీటి వనరులను మెరుగుపరచడంలో ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని హోం శాఖ మంత్రి వి.అనిత తెలిపారు. మహిళా భద్రత వారోత్సవాల్లో భాగంగా. విజయవాడలో నిర్వహించిన ర్యాలీలో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని చెప్పారు. మహిళా సాధికారత దేశాభివృద్ధికి కీలకమని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా హోలీ పండుగను ఈరోజు జరుపుకుంటున్నారు. దీనిని రంగులపండుగగా పిలుస్తారు. ఎటువంటి భేదభావాలు లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో ఈ పండుగలో పాల్గొంటారు. హోలీ పండుగకు పురాణాల్లో ప్రాముఖ్యత ఉంది. ప్రతీఏడాది పాల్గుణమాసంలో పౌర్ణమిరోజున హోలీ జరుపుకుంటారు.

హోలీ పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'హోలీ' పండుగ ప్రజలలో సోదరభావం, సద్భావనను బలోపేతం చేస్తూ, సమాజంలో శాంతి శ్రేయస్సును పెంపొందించే ఉత్సాహభరితమైన పండుగ అని తెలిపారు. హోలీ' పండుగ స్ఫూర్తి అన్ని అడ్డంకులను అధిగమించి, సామాజిక నిర్మాణాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా విస్ఫోటంలో గాయపడిన వారికి చికిత్స కొనసాగుతోందని కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ లావణ్య కుమారి తెలిపారు. కాకినాడలో నిన్న ఆమె మాట్లాడుతూ, క్షతగాత్రులకు... నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నామన్నారు. మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలియజేస్తూ.

వాయిస్..30 సెకన్లు

-------------------------

నూతన క్రీడా విధానం ద్వారాక్రీడలకు ప్రాధ్యాన్యమిస్తూ తెలంగాణను ఆటల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. 2026-2027 బడ్జెట్ లో క్రీడాకారులకు ఆర్థిక సహాయం, ఇతర వసతులపై హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రోత్సహంతోనే విద్యార్థి, యువత క్రీడల్లో రాణిస్తారని తెలిపారు. ఒలంపిక్, పారా ఒలంపిక్, అంతర్జాతీయ, జాతీయ క్రీడల పోటీల్లో పతకాలు సాధిందించిన వారికి ఆర్థిక సహాయం అందించేలా బడ్జెట్ లో కేటాయింపులు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

చంద్రగ్రహణం కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాలను ఈరోజు మూసివేయన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాల నుంచి రాత్రి ఏడున్నర గంటల వరకు మూసివేయనున్నారు. గ్రహణం నేపథ్యంలో అన్ని రకాల దర్శనాలు, ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. గ్రహణం తర్వాత సంప్రోక్షణతో ఆలయాన్ని శుద్ధి చేసి భక్తులను సర్వ దర్శనానికి అనుమతించనున్నారు. అలాగే శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాలతో పాటు తెలంగాణలోని యాదగిరి గుట్ట, వేములవాడ ఆలయాలను మూసివేయనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నిన్న పరామర్శించారు. బాధితులను వ్యక్తిగతంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న చికిత్సపై వైద్యులతో చర్చించారు. అనంతరం కందుల దుర్గేష్ మాట్లాడుతూ, బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కోలుకుంటున్న బాధితులు వైద్యుల సూచనలను తప్పకుండా పాటించాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో ఎండల తీవ్రత పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ శాఖ తెలిపింది. కర్నూలులో అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలుగా నమోదైంది.

తెలంగాణాలోనూ ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 36.6 డిగ్రీలుగా నమోదైంది.

======================